సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



హైలెవెల్‌కు మోక్షమెప్పుడో.!

వల్లూరు - కమలాపురం మండలాల సరిహద్దున పాపాఘ్ని నదిపై నూతనంగా నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన నిర్మాణ అర్ధంతరంగా ఆగిపోయాయి. -8లో



ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

కడప నుంచి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలింపు తగదని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.0/23.6

వాతావరణం

జిల్లాలో గురువారం 23.6 - 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు పవన్ కల్యాణ్ కడపకు రాక

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం కడప నగరానికి రానున్నారు. ఉదయం 9.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10.15 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10.20 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.45గంటలకు నగరంలోని మున్సిపల్ హైస్కూలు (మెయిన్)కు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే మెగా పేరెంట్-టీచర్స్ మీట్‌లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు మున్సిపల్ హైస్కూలు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.25 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి బేగంపేటకు వెళతారు.

మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌పై దిశానిర్దేశం

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 7న మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానున్న నేపథ్యంలో కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ హై స్కూలు (మెయిన్) ను జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డీఈఓ మీనాక్షి, స్కూల్ హెచ్‌ఎం నాగమణి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ సూర్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

నేల సమతుల్యతను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్: నేల సమతుల్యతను మనం దరం కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేల సంరక్షణ మీద మానవ మనుగడ సాగుతుందన్నారు. రైతులందరూ భూ సంరక్షణకు ఎంతో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు తమ పొలాలకు తగిన మోతాదులో రసాయనిక ఎరువులను వాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకుని నేల ఆరోగ్యాన్ని, సమతుల్యతను కాపాడవచ్చన్నారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ భూసార పరీక్షల మేరకు పంటల సాగులో ఎరువుల యాజమాన్యం పాటించాలని తెలిపారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్, ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉండేలా మన జిల్లాలో తగిన పశుసంపద పెంచాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, శిల్పకళ, ప్రశాంతి, సురేష్‌కుమార్ రెడ్డి, మానస, నవత, ప్రదీప్ పాల్గొన్నారు.

వైవీయూ ఆచార్యుడి బృందానికి అభినందన



ఆచార్య కె. రఘుబాబును అభినందిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం ఆచార్యులు డాక్టర్ కొట్టాల రఘుబాబుకు రెండు పేటెంట్లు లభించాయి. వైవీయూ జియాలజీ విభాగం, సీఎస్ఐఆర్ నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ) సంయుక్త పరిశోధన ద్వారా రెండు ప్రతిష్టాత్మక పేటెంట్లను సాధించారు. 'జియో ఇంటిగ్రేటెడ్ సాయిల్ ప్రాపర్టీ డివైస్ విత్ ఎన్హాన్స్ జీపీఎస్ అక్యురసీ' అనే ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, 'జియో స్పేషియల్ మల్టీ సెన్సార్ సాయిల్ టెస్టింగ్ ప్రోబ్' అనే ఆవిష్కరణకు యూకే డిజైన్ పేటెంట్ లభించింది. ఈ రెండు ఆవిష్కరణలు భూసార పరిశోధనల రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తున్నాయి. ఈ విజయాల్లో ఆచార్య కె. రఘుబాబుతో పాటు ఆయన పరిశోధన బృందం సభ్యులు అనూష బోయా నక్కల డా. ప్రదీప్ కుమార్ బాదవల్లి డా. సక్రం గుగులోతు, డా. పి. పద్మశ్రీ, గీతిక ఉన్నారు. ఈ సందర్భంగా పేటెంట్ పొందిన బృంద సభ్యుడైన ఆచార్య రఘుబాబును వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి, భూగర్భశాస్త్ర ఆచార్యులు సునీత, జయరాజు, శ్రీనివాస గౌడ్, పీఆర్ సెల్ డైరెక్టర్ సరిత అభినందించారు.



అన్నదాతకు అపార నష్టం



పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె గ్రామం వద్ద దెబ్బతిన్న వరి పంట (ఇన్‌సెట్) పోరుమామిళ్ల మండలం సిద్ధవరంలో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న మహిళా రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి..



నాపేరు ఓబయ్య. మాది కలసపాడు మండలం చెన్నుపల్లి. నేను ఐదు ఎకరాల్లో మినుము, ఒకటిన్నర ఎకరాలో వరి సాగు చేశా. ఇప్పటివరకు లక్ష రూపాయలకుపైగా ఖర్చు అయింది. వరిపంటను మరో రెండు మూడు రోజుల్లో కోయాల్సి ఉండగా వర్షాలు వస్తుండంతో వాయిదా వేసుకున్నాను. దీనికితోడు మినుము పంట కూడా పూత పిందె, కాయలతో ఉండేది. ఉన్నట్లుండి వర్షం రావడంతో వర్షపు నీరంతా పొలంలో నిలిచింది. దీంతో మినుము పంట కుళ్లిపోతుంది. వరిపంట పూర్తిగా పడిపోయింది. అది కూడా కోయడం కష్టం. దీంతో సాగు ఖర్చులతో పాటు దిగుబడి కూడా వచ్చేటట్లు లేదు. దీంతో భారీగా నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

పంటంతా నీట మునిగింది...



నా పేరు బక్కిరెడ్డి భాస్కర్‌రెడ్డి. మాది కలసపాడు మండలం మామిళ్లపల్లి. నేను పదిరోజుల క్రితం రూ.80 వేలు ఖర్చు పెట్టి ఏడు ఎకరాల్లో సీడు సజ్జ పంటను సాగు చేశా. పొలమంతా బాగా మొలక వచ్చింది. ఉన్నట్లుండి వచ్చిన వర్షంతో పంటంతా నీట మునిగింది. దీంతో మొలక మొత్తం దెబ్బతిననుంది. దీంతో నాకు సాగు ఖర్చు నెత్తికొచ్చింది. మళ్లీ నేను సేద్యం చేసుకుని విత్తుకోవాలంటే మళ్లీ లక్ష రూపాయల దాకా ఖర్చు వస్తుంది. అధికారులు ఆదుకోవాలి.

☛ ఇలాంటి పరిస్థితి వీరిద్దరి రైతులదే కాదు.. జిల్లా వ్యాప్తంగా చాలామంది రైతుల పరిస్థితి ఇదే. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం స్పందించి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- వాన దెబ్బకు వరి రైతు కుదేలు.. ఆరుతడి పంటలకు నష్టం
- జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షం.. నేలకొరిగిన వరిపంట
- పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- లబోదిబోమంటున్న రైతులు

కడప అగ్రికల్చర్: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసుకున్న రైతులకు పెద్ద కష్టం వచ్చిపడింది. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో నాలుగు రోజుల్లో పంట దిగుబడి చేతికొచ్చే సమయంలో ఉన్నఫళంగా వచ్చిన వర్షం అన్నదాతలను కుదేలు చేసింది. పశువులకు మేత కూడా లేకుండా చేసి రైతులకు పుట్టెడు దుఃఖాన్ని నింపింది.

వరి రైతుకు నష్టం....

వర్షంతో ముఖ్యంగా వరి రైతులు కుదేలయ్యారు. జిల్లావ్యాప్తంగా గత నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లాలో పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం దెబ్బతో వరిరైతులలోపాటు ఆరుతడి పంటల రైతుల ఆశలు వర్షార్పణమయ్యాయి.

● జిల్లాలో కేసీ కెనాల్‌తోపాటు చాలా చోట్ల వరిపంట కోత దశకు చేరుకుని కోతకు నేడా, రేపా అన్నట్లు ఉండేది. తుపాన్ కారణంగా వరితో పాటు పలు ఆరుతడి పంటల్లో సైతం వర్షపు నీరంతా నిలిచింది. గురువారం ఉదయం వరకు కూడా పలు పంటల్లో వర్షపు నీరు నిలిచే ఉంది. రైతులంతా పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించుకునే పనిలో ఉన్నారు.

వరికోతలకు కష్టతరమే....

జిల్లాలో వరి పొలాల్లో నిలిచిన నీరంతా బయటకు పంపినా సరే మళ్లీ పొలం ఆరాలంటే కనీసం ఐదారు రోజులు పడే అవకాశం ఉంది. కానీ నాలుగైదు రోజుల క్రితమే కోత కోసుకోవాల్సిన వరి పంట మరో నాలుగైదు రోజులు ఆలస్యం అయితే కోతకు పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలు చోట్ల భారీ వర్షాలతో వరిపంట నేలకూలింది.

ఆరుతడి పంటలు కూడా...

జిల్లాలో సాగు చేసిన మినుము, పెసర, పత్తి, మిరప, పూలతోటలలో కూడా వర్షంతో నీరంతా పొలాల్లో నిండి పంటలు దెబ్బతిన్నాయి. కొంత మంది ఇటీవలే మినుము, శనగ, సజ్జ, జొన్న విత్తుకున్నారు. ఈ వర్షంతో భూమిలో నీటి శాతం ఎక్కవై పంటలు దెబ్బతింటాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పెరగనున్న ఖర్చులు...

వర్షందాటికి పడిపోయిన వరితోపాటు వరిపొలాల్లో నీరంతా నిల్వ ఉండడంతో పొలాలన్నీ బురదమయంగా మారాయి. దీంతో ప్రస్తుతం వరికోతలను చేపట్టనున్న రైతులకు వరికోత ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరగనున్నాయి. పొలాలు బాగా ఆరి ఉంటే రైతన్నలు వరి కోత మిషన్ (టైర్ల మిషన్) ద్వారా వరిపంటను కోసుకునే వాళ్లు. దీనికి గంటకు రూ. 2 వేల నుంచి రూ. 2200 బాడుగ ఉండేది. ఇప్పుడు బురదమయం కావడంతో రైతులు బెల్ట్ మిషన్‌లతో వరి కోతను కోసుకావాల్సి వస్తుంది. దీనికి గంటకు రూ. 3200 నుంచి రూ. 3500 వరకు బాడుగ చెల్లించాల్సి వస్తుంది. దీంతో రైతులకు ఎకరాకు వెయ్యి రూపాయలు అదనపు ఖర్చుకానుంది. పొలాలు నెమ్ముగా ఉండడంతో మిషన్ స్పీడుగా తిరగడానికి వీలుకాదు. అప్పుడు గంటలు పెరిగి ఖర్చు కూడా పెరగనుంది. బెల్ట్ మిషన్‌తో కోత కోసిన వరిగడ్డి బురద ఉండడంతో పశువుల మేతకు పనికి రాదు. రైతులకు ఇదొక నష్టం.

▶▶ జిల్లాలో 3,153.79 హెక్టార్లలో పంట నష్టం

ఫెంగల్ తుపాన్‌తోపాటు బుధవారం కురిసిన భారీ వర్షానికి జిల్లాలో 3,153.79 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనాలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 109 గ్రామాల్లో 4745 మంది రైతులకు సంబంధించి 3089.05 హెక్టార్లలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట, అలాగే 64.74 హెక్టార్లలో పూత, పిందెతో ఉన్న మినుము పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

జిల్లాలో జోరు వాన

కడప అగ్రికల్చర్: ఫెంగల్ తుపాన్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఇందులో ఒంటిమిట్టలో అత్యధికంగా 66.2 ఎంఎం వర్షం కురవగా పులివెందుల్లో 7.4 అత్యల్ప వర్షపాతం నమోదయింది. జిల్లాలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
ఒంటిమిట్ట	:66.2	తొండూరు	:25.4
సిద్దవటం	:66.0	ప్రొద్దుటూరు	:23.6
చెన్నూరు	:62.4	కాశినాయన	:23.6
కమలాపురం	:60.4	ఖాజీపేట	:23.6
సీకేదిన్నె	:59.4	బి.మఠం	:21.6
దువ్వూరు	:58.2	వేంపల్లె	:19.2
వల్లూరు	:49.4	ఎర్రగుంట్ల	:19.0
చాపాడు	:47.4	సింహాద్రిపురం	:18.4
కడప	:43.4	గోపవరం	:17.2
కలసపాడు	:40.8	బి.కోడూరు	:16.8
రాజుపాలెం	:37.0	బద్వేలు	:16.8
మైదుకూరు	:37.0	చక్రాయపేట	:15.2
జమ్మలమడుగు	:34.4	ముద్దనూరు	:14.2
పెండ్లిమర్రి	:34.2	వీఎన్ పల్లె	:12.4
పోరుమామిళ్ల	:34.2	లింగాల	:12.4
మైలవరం	:30.6	వేముల	:8.0
కొండాపురం	:28.6	పులివెందుల	:7.4
అట్లూరు	:25.8	పెద్దముడియం	:6.8



కలసపాడు మండలంలో మొలక వస్తున్న సొద్ద పంటలో నిలిచిన వర్షపు నీరు



చాపాడులో ధాన్యం తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు



ప్రొద్దుటూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

▶▶ తగ్గిన ధాన్యం ధరలు



మొన్నమొన్నటి వరకు పుట్టి వడ్లు (బస్తా 78 కేజీలతో 8 బస్తాలు) రూ. 14 వేల వరకు అమ్ముడు పోయాయని.. వర్షాలు వచ్చినప్పటి నుంచి పుట్టి రూ. 11,200 నుంచి రూ.11,500 ధరకు అడుగుతున్నట్లు రైతులు తెలిపారు. అంటే పుట్టి వడ్లపైన దాదాపు రూ. 2,500 నుంచి రూ. 2,800 వరకు ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఇటు వర్షంతో అటు తగ్గిన ధరలతో అన్నదాతలకు కొలుకోలేని దెబ్బతగిలింది.

పెద్దదర్గా సన్నిధిలో సినీ నటి మీనాక్షి చౌదరి

కడప కల్చరల్: యువ సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం కడప నగరంలోని ప్రముఖ సూఫీ క్షేత్రమైన పెద్దదర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి ప్రధాన గురువుల మజార్‌ను ఆమె దర్శించుకున్నారు. ఆ ప్రాంతం గురించి స్వయంగా దర్గా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. వారు ఆమెకు దర్గా చరిత్ర, విశిష్ఠత, ప్రత్యేకతలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవాలన్న ఆశ నేటికీ వేరిందని, ఈ దర్శనం తనకెంతో సంతృప్తినిస్తోందని తెలిపారు.



పెద్దదర్గాలో మీనాక్షి చౌదరి

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- నేటి నుంచి జనవరి 8 వరకు
- నిర్దిష్ట కాల వ్యవధిలో అర్జీల పరిష్కారం
- ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారి
- ప్రత్యేక అధికారుల నియామకం
- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: భూ సంబంధమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల శుక్రవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీవెన్స్‌సెల్‌కు ఆరు వేల దరఖాస్తులు రాగా, అందులో అత్యధిక శాతం ఆర్ఓఆర్, భాగపరిష్కారాలు తదితర రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుకు ముందే వీఆర్వోలు గ్రామాలకు వెళ్లి ప్రతి రైతుకు రెవెన్యూ రికార్డులు అందిస్తామన్నారు. రైతులు వాటిని పరిశీలించి అవి సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే వీఆర్వోకు దరఖాస్తు సమర్పించాలన్నారు. నిర్దిష్ట కాలపరమితిలో వాటిని పరిష్కరిస్తామన్నారు. రోజుకు ఒకటి లేదా రెండు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. ఇప్పటికే షెడ్యూల్ రూపొందించామన్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బందితోపాటు రిజిస్ట్రేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఫారెస్టు అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు స్పెషల్ ఆఫీసర్లుగా మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నియమించామన్నారు. అలాగే మూడు నుంచి నాలుగు మండలాలకు ఒక డిప్యూటీ కలెక్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ తోసిపుచ్చిన సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● ఈనెల 7వ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు అందజేస్తామని తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో భాగస్వాములు కండి

శుక్రవారం నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీధర్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సదస్సులు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జేసీ అదితిసింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పుష్ప.. వైల్డ్ ఫైర్..

- థియేటర్ల వద్ద 'పుష్ప-2' రచ్చరచ్చ
- అభిమానుల్లో కట్టలు తెగిన ఉత్సాహం



కడప నగరంలోని రమేష్ థియేటర్ వద్ద అల్లు అర్జున్ అభిమానుల కోలాహలం



కడప కల్చరల్ : ఎవడ్రా బాస్.. ఎవడికి రా.. బాస్.. అంటూ పుష్ప-2 హీరో అల్లు అర్జున్ డైలాగ్‌ను ఆయన అభిమానులు కట్టలు తెగిన ఉత్సాహంతో చెబుతూ కేకలు పెట్టారు. దీనెవ్వా...తగ్గేదేలే అంటూ తమ హీరో పవర్ ఏమిటో చెప్పే ప్రయత్నం చేశారు. గురువారం సుకుమార్ దర్శకత్వంలో యువ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 చిత్రం విడుదలైంది. కేవలం కడప నగరంలోనే ఆరు థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేశారు. ఉదయం విడుదల కావాల్సిన ఈ చిత్రం బుధవారం రాత్రి 9.30 గంటల నుంచే ప్రదర్శించారు. ఈ సమయం కోసం వేచి చూసిన అభిమానులు గంట ముందే థియేటర్ల వద్దకు చేరుకుని ఈలలు, కేకలు, చప్పట్లతో సందడి చేశారు. తమ అభిమాన హీరో అల్లు అర్జున్ కటౌట్లు, ఫ్లెక్సీ బ్యానర్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి వాటిని పాలతో అభిషేకించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన అభిమానుల బృందాలు సినిమా పేరు, హీరో చిత్రంగల టీ షర్టులను ధరించి సందడి చేయడం అందరినీ ఆకర్శించింది. పలువురు అభిమానులు తమదైన శైలిలో థియేటర్ ఆవరణలో మోటారు బైక్‌లపై ఒళ్లు గగ్గుర్పొడిచే విన్యాసాలు చేసి తమ హీరో ఐ కాన్ స్టార్ స్టయిల్‌ను చాటారు. సినిమాలో బాగా ఆకట్టుకున్న ఎవడ్రా బాస్..ఎవడికి రా బాస్ డైలాగును పదేపదే గట్టిగా కేకలతో హోరెత్తించారు. థియేటర్ల ప్రాంగణాలు అభిమానులతో పోటెత్తాయి.

'పుష్ప' అంటే ఫ్లవర్ అనుకుంటివా...

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా...ఫైర్ అంటూ పుష్ప-1 సందడి చేసిన యువ హీరో అల్లు అర్జున్ రెండవ భాగంలో ఎవడ్రా బాస్...ఎవడికిరా బాస్ అంటూ రచ్చ చేయడం ఆయన అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ డైలాగ్ వచ్చిన ప్రతిసారి అభిమానులు వెర్రెత్తి పోయి కేకలు వేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. పుష్ప-2లో గతంలో వచ్చిన పుష్ప-1 కంటే టెక్నికల్ పాయింట్లు ఉన్నాయని, ఈ అద్భుతాలు మూడవ భాగానికి దారి తీస్తాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలో అల్లు అర్జున్ తారాస్థాయి నటన చూపారని, జాతర ఎపిసోడ్ మొత్తం సినిమాకే హైలెట్‌గా నిలిచిందని, మరికొన్ని ఎమోషన్ సీన్లను ఆయన బాగా పండించారని సంతృప్తి వ్యక్తం చేశారు. హీరోయిన్ రష్మిక కూడా బాగా నటించారని, విలన్‌గా ఫహాద్ ఫాజిల్ హీరోతో పోటీపడ్డారని ప్రేక్షకులు ఆనందంగా పేర్కొన్నారు. తొలిరోజే అయినా మహిళలు, యువతులు కూడా సినిమా చూడడానికి వచ్చారు.

నిజంగా ఫైరే



పుష్ప-2 చిత్రం నిజంగా ఫైరే. అల్లు అర్జున్‌లో మంచి నటుడు ఉన్నాడని ఈ సినిమా నిరూపిస్తోంది. మొదటి పార్ట్ కంటే రెండవది నటన పరంగా, టెక్నికల్‌గా ఎంతో బాగుంది. జాతర ఎపిసోడ్ చూసి తీరాల్సిందే. మూడవ పార్ట్ కోసం ఎదురు చూస్తాం. - నారాయణరెడ్డి, కడప

అద్భుతః



పుష్ప-2 అద్భుతః అనిపిస్తోంది. హీరో చివరి సీన్ వరకు రచ్చరచ్చ చేశాడు. మిగతా నటులంతా సీన్లను అద్భుతంగా పండించారు. దర్శకుడు సుకుమార్ తన సత్తాను మరోసారి చాటారు. - రామకృష్ణ కుటుంబ సభ్యులు, చెన్నూరు

పుష్ప-2 ఘన విజయం ..



పుష్ప-2 సినిమా ఘన విజయం సాధించడం ఖాయం. సినిమా ఆద్యంతం అందరినీ అలరించేలా దర్శకుడు సుకుమార్ చిత్రీకరించారు. ముఖ్యంగా పాటలు, డైలాగులు ఈ సినిమా ప్రత్యేకతలుగా చెప్పవచ్చు. - వెంకీ, కడప

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన సునీల్‌కుమార్‌రెడ్డి

వేముల : మండలంలోని వేల్పుల గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురానికి చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి సొంత పనుల నిమిత్తం వేంపల్లెకు వెళుతుండగా వేల్పుల సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సునీల్‌కుమార్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాయపడిన వ్యక్తిని స్థానికులు పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా రైల్వే పోలింగ్

కడపకోటిరెడ్డిసర్కిల్:ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు గురువారం రెండోరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. రైల్వేకోడూరు, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే రక్షక దళాలు, ప్రభుత్వ రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు కొనసాగించారు.

నేడు పోస్టల్ బ్యాలెట్

కాగా వివిధ రైల్వేస్టేషన్‌లలో ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితోపాటు రన్నింగ్ స్టాఫ్, టిక్కెట్ చెకింగ్, రక్షణ విభాగం సిబ్బంది శుక్రవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. దీంతో పోలింగ్ ప్రక్రియ ముగిసినట్లే.

హైలెవెల్‌కు మోక్షమెప్పుడో.!

- అర్ధంతరంగా ఆగిన పాపాఘ్ని హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు
- అటవీ శాఖ అడ్డంకులతో పనులపై నీలినీడలు
- వాహనదారులకు తప్పని కష్టాలు


పాపాఘ్ని నదిపై కొంత వరకు పూర్తయిన హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు


అటవీ శాఖ అభ్యంతరాలతో అర్ధంతరంగా ఆగిన హైలెవెల్ వంతెన పనులు

వల్లూరు : కడప–అనంతపురం ప్రధాన రహదారిపై వల్లూరు–కమలాపురం మండలాల సరిహద్దున పాపాఘ్ని నదిపై నూతనంగా నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు అటవీ శాఖ అభ్యంతరాలతో అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు అటవీ శాఖ నుంచి అనుమతులు మంజూరు కాకపోవడంతో నిలిచి పోయిన పనుల ప్రారంభంపై నీలి నీడలు అలుముకున్నాయి. అసలు అటవీ శాఖ నుంచి అనుమతులు వస్తాయా లేదా అనే అనుమానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

భారీ వర్షాల కారణంగా పాపాఘ్ని నదికి వచ్చిన భారీ వరదల నేపథ్యంలో 2021 నవంబర్ 21వ తేదీన ఈ నదిపై ఉన్న హైలెవెల్ వంతెనలో కొంత భాగం కుంగి కూలి పోయింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్పటి స్థానిక శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అప్పటి ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి జిల్లాలోని నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి మొదట పూర్తి స్థాయిలో వాహనాల రాక పోకలను సాగించడానికి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

■ అనంతరం ఒక్కో వెంట్ 25 మీటర్ల వెడల్పు, 14 మీటర్ల పొడవుతో 26 వెంట్‌లను, 650 మీటర్ల వంతెనతో కలిపి మొత్తం 1.81 కిలో మీటర్ల మేర రోడ్డును నిర్మించడానికి నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టారు. నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పూర్తి చేశారు. ఈ మేరకు హైలెవెల్ వంతెన నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. 2022 డిసెంబర్ 23 వ తేదీన కమలాపురం పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి పలు అభివృద్ధి పనులతో బాటు ఈ హైలెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

■ అనంతరం భూ సార పరీక్షలను నిర్వహించి పనులను ప్రారంభించారు. నేషనల్ హైవే అధికారుల నిత్య పర్యవేక్షణలో పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిర్మాణ పనుల్లో భాగంగా 27 పియర్స్ ఫౌండేషన్‌లలో 27 పూర్తి చేశారు. 27 పియర్స్ (పిల్లర్)లలో 26 పూర్తి స్థాయిలో పూర్తయ్యాయి. 21 వెంట్‌లు స్లాబ్, లైటింగ్ సిస్టంతో సహా పూర్తయ్యాయి.

అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిన పనులు

నేషనల్ హైవే అధికారుల కృషి ఫలితంగా మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు ముగిసి ప్రజలకు వంతెన పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందనుకుంటున్న తరుణంలో అటవీ శాఖ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. సుమారు 10 నెలల క్రితం అటవీ శాఖ అధికారులు తమ అనుమతులు లేకుండా అటవీ భూమిలో నిర్మాణ పనులు చేపట్టారంటూ అభ్యంతరం చెప్పింది. దీంతో మిగిలిన 5 వెంట్‌ల నిర్మాణం అర్ధంతరంగా నిలిచి పోయింది. 80 శాతానికి పైగా పనులు పూర్తయినప్పటికీ ఆ శాఖ అభ్యంతరాలతో మిగిలిన 20 శాతం పనులు పూర్తిగా నిలిచి పోయాయి.

అటవీ శాఖ నిర్లక్ష్యంతోనే సమస్య

వాస్తవానికి నేషనల్ హైవే అధికారులు అటవీ శాఖకు సంబంధించి అనుమతులు పొందిన తరువాతనే పనులను ప్రారంభించారు. అయితే అనుమతులకు వెళ్లడానికి ముందు అటవీ శాఖ భూముల సరిహద్దులను గుర్తించి, ఎంత విస్తీర్ణంలో అటవీ భూమి ఉందో నివేదించాల్సిన ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా నదీ ప్రవాహంలో అటవీ భూమి కొంత మేర కోతకు గురైంది. అయితే నది ఒడ్డు వరకు మాత్రమే తమ భూమి ఉన్నట్లు పొరబడిన ఆ శాఖ అధికారులు నదిలోని అటవీ భూమిని గుర్తించడంలో విఫలమయ్యారు. దీంతో వారు సూచించిన మేర విస్తీర్ణానికే కేంద్ర అటవీ శాఖ నుండి అనుమతులు లభించాయి. ఈ మేరకు పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తున్న తరుణంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారంటూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో పనులు పూర్తిగా నిలిచి పోయాయి.

నిలిచిన అనుసంధాన రోడ్డు నిర్మాణం

వంతెన పనులతో బాటు వంతెనకు రెండు వైపులా నిర్మించాల్సిన అనుసంధాన రోడ్డు పనులు సైతం నిలిచి పోయాయి. కమలాపురం వైపు నిర్మించాల్సిన రోడ్డుకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డును పూర్తి చేశారు. వల్లూరు వైపున పాపాఘ్ని నగర్ వద్ద నిర్మించాల్సిన రోడ్డులో అటవీ అభ్యంతరాలు లేనంత వరకు రోడ్డును పూర్తి చేశారు. నది వద్ద నుండి పాపాఘ్ని నగర్ వరకు మధ్యలో అటవీ భూమి ఉండడంతో రోడ్డు పనులు సైతం నిలిచిపోయాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేగవంతంగా పనులు జరుగుతున్న క్రమంలో అటవీ శాఖ అభ్యంతరాల వలన పనులు నిలిచి పోయాయి. అప్పటికే ఎన్నికలు సమీపించడం వలన అప్పటి స్థానిక ఎమ్మెల్యే, ఇతర అధికారులు ప్రయత్నాలు చేసినప్పటికీ అటవీ శాఖ నుంచి అనుమతులు రావడంలో ఆలస్యం జరిగింది. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ అటవీ శాఖ అనుమతులు తీసుకురావడంలో ఆసక్తి చూపలేదు. దీంతో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ అనుమతులు రాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి నేతలు, అధికారులు స్పందించి అటవీ శాఖ అనుమతులు పొంది పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ వంతెన పూర్తయితే జిల్లాలోని ఎర్రగుంట్ల, నల్లింగాయపల్లె, చిలంకూరు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి తదితర ప్రాంతాల్లో ఉన్న భారీ సిమెంట్ పరిశ్రమల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సిమెంటు రవాణాకు, ఇతర ప్రాంతాల నుంచి ఈ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను తీసుకుని రావడానికి ఇబ్బందులు తొలగుతాయి. ఆర్‌టీపీపీ నుంచి ఫ్లైయాష్‌ను ఇతర ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలకు తరలించడానికి, అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం అనంతపురం, తాడిపత్రి పట్టణాల నుంచి, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారితో బాటు పలు ఇతర ప్రాంతాల నుంచి ప్రజా రవాణాతో బాటు సరుకుల రవాణాకు సంబంధించి సమస్యలను నివారించవచ్చు.

దోషులను శిక్షించాలి


జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.ఎ జాన్ అహ్మద్‌ను తరగతి గదిలోనే కొట్టి చంపిన ఉన్మాదులైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కడప కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిపై సాక్షాత్తు తరగతి గదిలోనే ఉన్మాదులైన కొందరు విద్యార్థులు రెచ్చిపోయి దాడి చేసి చంపేశారంటే సమాజంలో విలువలు ఏ మేరకు పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చన్నారు. మారుతున్న సమాజంలో తప్పు చేసిన విద్యార్థులను తల్లిదండ్రులు సైతం మందలించకపోవడం, తప్పు చేసిన వారిని వెనకేసుకురావడం లాంటి ఘటనల వల్లే ఇలాంటి విపరీత పోకడలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.డి ఇలియాస్ బాషా, ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, బీటీఏ జిల్లా అధ్యక్షుడు జ్యోతి రామచంద్ర బాబు, యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, ఎయిడెడ్ గిల్డ్ జిల్లా అధ్యక్షుడు బాల శౌరెడ్డి, ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు జలీల్ ఖాన్, జిల్లా సెక్రెటరీ నజీర్ బాషా, ఆర్ అండ్‌బీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు బత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయం


మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు

కడప అర్బన్ : ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయమని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్ప నాయుడు పేర్కొన్నారు. కడప న్యాయవాదుల సంఘం సమావేశం హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ నడిబొడ్డున కడపలో ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయకపోవడం సబబు కాదన్నారు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం కేసుల సంబంధిత కోర్టులు తిరుపతిలో పెట్టడం వలన అక్కడి పవిత్రత దెబ్బతింటుందన్నారు. ఈ విషయంపై నేటి నుంచి 7వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి కెనడీ పాల్గొన్నారు.

ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డికి 'తుమ్మల' సాహితీ పురస్కారం


ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వరరెడ్డికి తుమ్మల సీతారామయ్య సాహితీ పురస్కారం అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శివప్రసాద్ తెలిపారు. అభ్యుదయ సాహిత్యంలో కృషిచేసే వారిని గుర్తించి ప్రతి యేటా ఒక రచయితకు పురస్కారం అందజేస్తారు. 2024 సంవత్సరానికి సంబంధించి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 7వ తేదీ శనివారం గుంటూరులో నిర్వహించనున్న సాహిత్య కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతకు రూ.5వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువ అందజేయనున్నారు. ఎంఏ తెలుగు, ఎంసీజే (జర్నలిజం) పూర్తి చేసిన ఈయన అవంత్స సోమసుందర్ రచనలపై పీహెచ్‌డీ, ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు–ఇజాలు అన్న అంశంపై భారత ప్రభుత్వ ఫెలోషిప్‌తో పరిశోధన పూర్తి చేశారు. 80కిపైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణలు, 90కిపైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి. కన్నీటి సీమ, రైతన్నా మేలుకో–ఆత్మహత్య మానుకో, మనసుపాట, కవిత–మానవీయత, సాహిత్యం–సమాజం, నాకొక మనిషి కావాలి, తిలక్ సాహిత్యం వంటి రచనలు చేశారు. ప్రతిష్టాత్మక పురస్కారానికి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి ఎంపిక కావడం పట్ల పలువురు ఆచార్యులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఇద్దరికి 6 నెలల జైలు శిక్ష

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఓ కేసుకు సంబంధించి కమలాపురం మేజిస్ట్రేట్ 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు కలమల్ల ఎస్ఐ తిమోతి గురువారం తెలిపారు. చిన్నదండ్లూరు గ్రామానికి చెందిన రామలింగారెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డిలపై 2022లో అప్పటి ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసు సంబంధించి గురువారం కమలాపురం కోర్టు మేజిస్ట్రేట్ ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిందని తెలిపారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు


సమావేశంలో పాల్గొన్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నుంచి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలింపు తగదని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు జగదీశ్వర్‌రెడ్డి, మహమ్మద్, రఘునాథరెడ్డి, లక్ష్మిరాజా మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని 20 ఏళ్ల క్రితం పూర్తి సౌకర్యాలతో కడప నగరంలో 50 సెంట్ల విస్తీర్ణంలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించారన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒకే రాష్ట్రం – ఒకే గ్రామీణ బ్యాంకు పేరుతో అన్ని గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా మూడు గ్రామీణ బ్యాంకుల కంటే, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు తన పరిధిలోని ఐదు జిల్లాలలో గ్రామీణ ప్రాంతాల రైతులకు, చిన్న పెట్టుబడిదారులకు, చిన్న మధ్యతరగతి వ్యాపారస్తులకు అత్యున్నత సేవలు అందించడంలో ముందుందన్నారు. మిగిలిన బ్యాంకుల కంటే అధిక బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతున్నారని తెలిపారు. ఆ మేరకు కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.

భవిష్యత్ కార్యాచరణ

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగాలే భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు వారు పేర్కొన్నారు. ఏపీజీబీ సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులను కలిసి పోస్ట్ కార్డ్ క్యాంపెయిన్‌ను చేపడతామన్నారు. కరపత్రాలు పంచడం, పోస్టర్ల విడుదలతోపాటు ప్రజా ప్రతినిధులకు నివేదికలు అందజేస్తామన్నారు. వచ్చే రెండు వారాల్లో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్ ప్రాంతాలలో ప్రాంతీయ సదస్సులు, కడప, అనంతపురంలలో జనకవనం పేరుతో సాహితీ కార్యక్రమాలు, అనంతపురం, కదిరిలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, విద్యుత్ సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ తదితర కార్యక్రమాలు ఉధృతంగా చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు రాఘవరెడ్డి (న్యాయవాది), అవధానం శ్రీనివాస్ (ఇన్సూరెన్స్), నాగ సుబ్బారెడ్డి (ఏఐటీయూసీ), మనోహర్, రామమోహన్, చంద్ర (సీఐటీయూ), మహేష్ (యూటీఎఫ్), సుధాకర్ (టెలికం), ఓబులేసు, నవీన్ (గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య), దేవర కృష్ణ (లోక్‌సత్తా) పాల్గొన్నారు.

ఎర్ర చందనం స్మగ్లర్ అరెస్టు

గౌరిబిదనూరు : ఓ వాహనం చోరీ కేసులో తీగ లాగితే ఎర్ర చందనం స్మగ్లర్ చిక్కాడు. బెంగళూరు వద్ద చిక్కబళ్లాపురంలో కారు పార్కింగ్ నుంచి టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. బంగారికి చెందిన వ్యాన్‌ను వైఎస్సార్ జిల్లా చాపాడుకు చెందిన ఎర్ర చందనం దొంగ ఫకృద్దీన్ మే ఆఖరులో ఎత్తుకెళ్లాడు. ఈ చోరీ సీసీ కెమెరాలలో రికార్డయింది. అప్పట్లో అతడు ఉపయోగించిన ఇన్నోవా కారు బెంగళూరుకు వచ్చినట్లు పోలీసులకు తెలిసింది. దీంతో ఆ కారు జాడను పసిగట్టి దొంగను తిరుపతిలో అరెస్టు చేసి బుధవారం చిక్కబళ్లాపురం తీసుకువచ్చి స్థల పరిశీలన చేశారు. ఆ వ్యాన్‌ను ఎర్ర చందనం రవాణాకు ఉపయోగించినట్లు ఒప్పుకున్నాడు. ఇతడు బడా దొంగ అని, కర్ణాటక, తెలుగు రాష్ట్రాలలో 72 కేసులుండగా, వాటిలో 70 కేసులు ఎర్ర చందనానివే అని పోలీసులు చెప్పారు. కోట్లాది రూపాయల ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తుంటాడని తెలిసింది.

కేవీపల్లె వాసి కువైట్‌లో మృతి

కేవీపల్లె : కేవీపల్లె మండలానికి చెందిన ఓ వ్యక్తి కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ వంకాటవారిపల్లెకు చెందిన పెంచలయ్య (54) తన భార్యతోపాటు బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. గత నెల 30న పెంచలయ్య గుండెపోటుకు గురై మృతి చెందాడు.

ఎజాస్ హంతకులను కఠినంగా శిక్షించాలి

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి


కడప అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయచోటిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్‌ను హత్య చేసిన నిందితులను చట్టాలకు అతీతంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం యాభై లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధన రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు నైతిక విలువలు, సత్ప్రవర్తన అందించడంలో విఫలం కావడంతోనే పవిత్రమైన పాఠశాలలో ఉపాధ్యాయుని హత్య జరిగిందన్నారు.

సమగ్ర విచారణ జరపాలి: ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి స్వయంగా జోక్యం చేసుకోవాలన్నారు.

విచారకరం..

ఉపాధ్యాయుడి మరణం అత్యంత దురదృష్టకరమని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, ఈశ్వరచంద్ర అన్నారు.

ఇది హేయమైన చర్య

ఉపాధ్యాయుడి హత్య చాలా హేయమైన చర్య అని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, వెంకటనాథరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరనాథ్‌రెడ్డి, రమేష్‌బాబు అన్నారు. విద్యాలయాల్లో ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొవ్వొత్తులతో నిరసన..

ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో కడపలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు సలాం, శ్రీరామ్, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం మంట కలిసిన వేళ!

- తోటి ఉపాధ్యాయునిపై దాడి జరుగుతున్నా అడ్డుకోని ఉపాధ్యాయులు
- గుండెపోటుతో మృతి చెందాడంటూ ప్రచారంపై మండిపాటు
- నిందితులను కఠినంగా శిక్షించాలని కలెక్టర్, ఎస్పీలకు విన్నపం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు


ఎజాస్ అహ్మద్ (ఫైల్)

రాయచోటి : నేటి సమాజంలో తల్లి, తండ్రి, గురువు, దైవం అన్న మాటలకు నీళ్లొదిలారు. రోజురోజుకు సమాజంలో జరుగుతున్న దారుణాలు సభ్య సమాజంలో మానవ విలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తల్లిదండ్రుల మాటకు విలువ ఇచ్చి, గురువులను గౌరవించి క్రమశిక్షణతో విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు పెడతోవ పడుతున్నారు. మద్యం, గంజాయి లాంటి వ్యసనాలకు బానిసలై పైశాచిక చర్యలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్న పరిణామం.

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడిపై కిరాతకంగా దాడికి తెగబడిన హేయమైన ఘటన యావత్ లోకాన్ని సిగ్గుపడేలా చేసింది. ఇద్దరు విద్యార్థులు సాటి విద్యార్థిని కొడుతుంటే వారించిన ఉపాధ్యాయుడిని అదే విద్యార్థులు కలిసి కొట్టి చంపిన దుర్మార్గ ఘటన సమాజాన్ని కలవరపెడుతోంది. ఈ దారుణానికి కారణం పిల్లలను క్రమ శిక్షణలో పెంచని తల్లిదండ్రులా? లేక వారి చుట్టూ ఉన్న పరిస్థితులా? లేక చదువులు నేర్పే గురువుల లోపమా అనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

సినిమా స్టైల్‌లో దాడి

రాయచోటి పట్టణం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి గదిలో ఘర్షణ పడుతున్న ఇద్దరు విద్యార్థులను ఎజాస్ అహమ్మద్ గట్టిగా మందలించారు. ఉపాధ్యాయుడి మందలింపుతో కోపోద్రిక్తుడైన ఒక విద్యార్థి ఇంటి దగ్గర ఉన్న సోదరుడికి సమాచారం చేరవేశాడు. ఆ యువకుడు తన మిత్రునితో కలిసి పాఠశాలలోని తరగతి గదిలోకి చేరుకుని ఉపాధ్యాయుడిపై పిడిగుద్దులు గుద్దుతూ, కాళ్లతో తన్నుతూ, ముంజేతికి ధరించిన కడియాలను పిడికిలిలో పట్టి దాడి చేసిన ఘటన అచ్చం సినిమాలో హీరో ఫైట్లను తలపించాయని విద్యార్థులు చెబుతున్నారు. మృతుని శరీరంపై కనిపిస్తున్న గాయాలను చూసి ఉపాధ్యాయుడి భార్య తన భర్తను కొట్టి చంపారంటూ కన్నీటి పర్యంతమైంది. జరిగిన సంఘటనను తనకు చెప్పకపోగా, దాడి చేసిన వారికి తోటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు మద్దతు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మానవత్వాన్ని మరిచిన ఉపాధ్యాయులు

400 మంది విద్యార్థులు, 20 మందికిపైగా ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉన్న పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిపై ముగ్గురు యువకులు కిరాతకంగా దాడి చేసిన సంఘటన కళ్ల ఎదుట కనిపిస్తున్నా.. వారిని వారించే విషయంలో కానీ, తోటి ఉపాధ్యాయునికి తోడుగా నిలవడానికి ఒక్కరంటే ఒక్క ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు ముందుకు రాకపోవడం మానవతా విలువలను మంటగలిపేలా చేసింది. సంఘటన జరిగిన తర్వాత అయినా యదార్థ సంఘటనను కుటుంబ సభ్యులకు, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్న ఇంగిత జ్ఞానం కూడా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులకు లేకపోవడం సిగ్గుచేటు. కలెక్టర్, పోలీస్ అధికారులు, మీడియా ప్రతినిధులు వాస్తవాల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించినా గుండెపోటుతో మృతి చెందినట్లు పదేపదే చెప్పడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమానాలెన్నో.. ముగ్గురు విద్యార్థులు కలిసి ఉపాధ్యాయునిపై దాడి చేస్తున్నా తోటి ఉపాధ్యాయులు ఎందుకు అడ్డుకోలేదు.. సంఘటన జరిగిన తర్వాత విద్యార్థుల పేర్లను ఎందుకు బయటపెట్టలేదు.. గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించామని పదే పదే ప్రధానోపాధ్యాయుడు ఎందుకు చెబుతున్నారనే అనుమానాలు ఉన్నాయి.